క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: మున్సిపాలిటీలోని మెప్మా ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, బ్యూటీషియన్ కోర్సుల్లో స్త్రీలు, పురుషులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 30వ తేదీ లోపు మున్సిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుదారులు రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంకు పాసు బుక్, పాన్‌కార్డు జెరాక్సులను ఇవ్వాలన్నారు.

జాబ్‌మేళాలో 22మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటేశులు

పలమనేరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీ–డాప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు 22మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు తెలిపారు. బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరై హాజరైన 53మందికి ఇంటర్వ్యూలు నిర్వహించిన ఎంపిక చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, సుబ్బయ్య నాయుడు, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లోకేష్, కో–ఆర్డినేటర్ సిసింద్రి పాల్గొన్నారు.

కారు ఢీ: చిన్నారికి గాయాలు



కారు ఢీకొనడంతో గాయపడిన తరుణ్

చౌడేపల్లె: కారు ఢీకొని చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చౌడేపల్లె–బోయకొండ ప్రధాన రోడ్డు మార్గంలోని ఊటూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ..ఊటూరుకు చెందిన మునిరాజ, రోజ దంపతుల కుమారుడు తరుణ్ ఊటూరులోని ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. పాఠశాల వదిలిన అనంతరం ఇంటికి వచ్చి ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా చౌడేపల్లె నుంచి బోయకొండ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలుడిని 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలతోనే మానవళి మనుగడ



రైతు భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఐరాల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అగ్రానమీ ప్రొఫెసర్ వై రెడ్డిరాము అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో శుక్రవారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ వనమహోత్సవాన్ని ప్రొఫెసర్ రెడ్డి రాము, ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అసిస్టెంట్ డాక్టర్ లావణ్య ప్రారంభించారు. రెడ్డిరాము మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులతో కలిసి వారు సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఆవరణ, గ్రామంలోని ఖాళీ స్థలాల్లో అంజన్, ఎర్ర చందనం, అంజీర్ మొక్కలను నాటారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి గ్రామంలో ఉన్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పండించే పంటల గురించి ఆరా తీశారు. గ్రామానికి కావలసిన మౌలిక వసతులపై, సామాజిక ఆర్థిక సర్వే ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈరోజు

విద్యుత్ అంతరాయం

కుప్పం రూరల్: గుత్తార్లపల్లె సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా కుప్పం పట్టణంతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో ఎండీ సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ ప్రతిపాదనలపై సమావేశంలో చర్చిస్తామని, అన్నిశాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.



పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి.



కుప్పంలో పోరుబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ భరత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

హోరెత్తిన పోరుబాట

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ భారీ నిరసన ర్యాలీ
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి





పుంగనూరు: ఈఈ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి. కుప్పం: రెస్కో ఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

పుంగనూరు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పుంగనూరు 'పోరుబాట'తో హోరెత్తింది. వర్షం కురుస్తున్నా లెక్క చేయక నియోజకవర్గ వ్యాప్తంగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప కలసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ప్లకార్డులు చేతబట్టుకుని ఎంబీటీ రోడ్డు, పోలీస్ స్టేషన్, గోకుల్ సర్కిల్, పీఎల్ఆర్ రోడ్డు మార్గం మీదుగా ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దారి పొడవునా నినాదాలతో హోరెత్తించారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని, తగ్గిస్తామంటూ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, చార్జీల పెంపుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు భారీ షాక్ ఇచ్చారని ఎమ్మెల్యే, ఎంపీ నిప్పులు చెరిగారు. కార్యాలయంలో ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తికి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగభూషణం, బైరెడ్డిపల్లె రెడ్డెప్ప, రెడ్డీశ్వర్ రెడ్డి, ముడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, అమరేంద్ర, త్యాగరాజు, చంద్రారెడ్డి యాదవ్, అమరనాథరెడ్డి, రాజేష్, సురేష్, నరేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలతో 'బాబు' బాదుడు

పలమనేరు: మూడు రెట్లు కరెంట్ చార్జీలను పెంచి ప్రజలకు షాక్ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలను ఉపసంహరించేవరకూ తాము ఆందోళనతో తగ్గేదేలేదని పలమనేరు నియోజకవర్గ నేతలు స్పష్టం చేశారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి నాయకులతో కలసి శుక్రవారం పలమనేరులో వైఎస్సార్ సీపీ పోరుబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమని ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు కేవలం ఆరునెలల పాలనలో కరెంట్ చార్జీలను పెంచి, పేదలపై రూ.15,485కోట్ల భారం మోపారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు ఇస్తే కూటమి ప్రభుత్వం దీన్ని రద్దు చేసిందన్నారు. అప్పుడేమో బాదుడే బాదుడన్న ఆ పెద్దమనిషి ఇప్పుడు జనంపై గుద్దుడే గుద్దుడుకు పూనుకున్నారని దుయ్యబట్టారు.

ఇదీ 'బాబు' విజన్..!

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ, తానో విజనరీనని తనకు తాను గొప్పలు చెప్పుకనే చంద్రబాబు..ఎన్నో హామీలిచ్చాం ఇక్కడ చూస్తే ఖజానా ఖాళీగా ఉంది.. ఏమీ అర్థం కావడం లేదని నంగనాచిలా చెబితే జనం నమ్ముతారా? అని సూటిగా ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేనాటికి చంద్రబాబు సర్కార్ ఖజానాను ఖాళీ చేసిందని, కానీ జగనన్న ప్రజలకిచ్చిన హామీలను ఎలా నెరవేర్చారో అందరికీ తెలుసున్నారు. జనమే రోడ్లపైకొచ్చి చంద్రబాబు ప్రభుత్వానికి దింపడం తథ్యమన్నారు.

ప్రజలే బాబుకు వాతలు పెట్టడం తథ్యం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ, కరెంట్ చార్జీలను పెంచిన ప్రభుత్వానికి ప్రజల నుంచి వాతలు తప్పవని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, దయానంద్, ఎంపీపీలు యువరాజ్, రెడ్డెప్ప, నాయకులు బాగారెడ్డి, చెంగారెడ్డి, మండీ సుధా, ప్రహ్లాద, గణేష్ యాదవ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.



పలమనేరు: ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం ఇస్తున్న వెంకటేగౌడ, శ్రీనివాసులు



పలమనేరు: ట్రాన్స్‌కో కార్యాలయానికి నిరసన ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదం తొక్కిన కుప్పం

- విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ నిరసన
- పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ
- ప్రభుత్వం తీరుపై మండిపడిన ఎమ్మెల్సీ భరత్

కుప్పం: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ హామీలను నెరవేర్చకుండా ప్రజలను దగా చేస్తోందని ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి, ప్రజల నడ్డి విరుస్తోందని నిరసిస్తూ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కుప్పంలో పార్టీ శ్రేణులతో భరత్ పోరుబాట ర్యాలీ నిర్వహించారు. తొలుత ఉదయం 11 గంటలకు బస్టాండు ప్రాంగణంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం రెస్కో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. రెస్కో ఎండీకి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని, ఈ చార్జీల పెంపు వల్ల జనవరి నుంచి వినియోగదారులపై రూ. 9.412 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. పెంచిన చార్జీలను ఉపసంహరించే వరకూ ఆందోళనలు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను కొనసాగించాలని, వ్యవసాయానికి కనెక్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

శుక్రవారం ఉదయం నుంచి చిరుజల్లుల వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తున్నా పోరుబాటకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా కదిలారు. వైఎస్సార్ విగ్రహం వద్ద, రెస్కో కార్యాలయం వద్ద భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. రెస్కో ఎండీకి వినతిపత్రాన్ని అందజేసేందుకు ఆంక్షలు విధించి, కేవలం ఒకరిద్దరిని మాత్రమే లోపలికి అనుమతించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హఫీజ్, మోహన్‌రామ్, మురుగేష్, కోదండరెడ్డి, క్రిష్ణమూర్తి, రామ్మూర్తి, చెంగప్ప, పెద్దన్న, ఈశ్వర్, బుల్లెట్ దండపాణి, బాబురెడ్డి, భాగ్యరాజ్ పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలను చేయడమే ధ్యేయం

- మెప్మా పీడీ రవీంద్ర



ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: మహిళా గ్రూపుల్లోని ప్రతి కుటుంబంలోనూ ఓ వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో మెప్మా కృషి చేస్తోందని, దీని వల్ల సభ్యుల కుటుంబ ఆదాయం లక్షకు తగ్గకుండా ఉంటుందని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వ్యాపారవేత్తలు తీర్చిదిద్దాలనే ధ్యేయంతో గ్రూపు సభ్యులకు అవసరమైన శిక్షణ, ఆ తర్వాత యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే స్థానికంగా పలు రకాల పనులు చేసేవారికి శిక్షణ ఇచ్చి ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్లను ఇస్తున్నట్టు చెప్పారు. వీరికి ట్రయాంగిల్ ప్లాట్‌ఫామ్ ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. ఇలాంటి సేవలపై శిక్షణ పొందేందుకు ఆసక్తి గల వారు నెలాఖరు లోపు తమ కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి



మన్మోహన్ సింగ్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్



పుంగనూరులో..



పలమనేరు: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

కుప్పం: భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆర్టీసీ బస్టాండు వద్ద ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ భరత్ నివాళులర్పించారు. రెండుసార్లు భారత ప్రధాన మంత్రిగా, దేశానికి ఆర్థిక శాఖామంత్రిగా భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహావ్యక్తి అని మన్మోహన్‌సింగ్ సేవలను స్మరించారు. ఆయన మృతి దేశ మేధావి వర్గానికే తీరని లోటని అన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: భారత దేశ ఆర్థిక సంస్కరణల కర్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శుక్రవారం ఘననివాళులర్పించారు. పట్టణంలోని కాంగ్రెస్ యూత్ నాయకులు అయూబ్, అల్తాఫ్, ముబారక్, ఫయాజ్, షానవాజ్, అజ్మత్ కలసి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు.

పలమనేరులో..

పలమనేరు: దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగా దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన సేవలు శ్లాఘనీయమని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ప్రస్తుతించారు. స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిబ్బందితో కలసి శుక్రవారం నివాళులర్పించి ఆయన మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా ప్రభుత్వం వారం పాటు సంతాప దినాలను పాటిస్తోందన్నారు. సమాచార హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ పథకాలను తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందని కీర్తించారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు ఇనాయతుల్లా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొరవ పోతున్న ప్రాజెక్టు



జలకళతో ఉన్న గంటావారిపల్లె ప్రాజెక్టు

సదుం: మండలంలోని గంటావారిపల్లె ప్రాజెక్టు మొదటిసారిగా పూర్తి స్థాయిలో నిండి మొరవ పోతోంది. దీనిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో నిర్మించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు..గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చీకలచేను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన నీటితో ప్రాజెక్టు నిండింది. స్థానిక రైతులు, ప్రజలు నిండిన ప్రాజెక్టును ఆసక్తిగా తిలకించారు. ఇక, మండలంలో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వారపు సంతలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నానికి వర్షం తెరిపి ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

'ప్రథమ చికిత్సలో వారు కూడా కీలకమే'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ స్వర్ణతేజ

పలమనేరు: గ్రామీణ ప్రాంతాల్లో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ప్రథమ చికిత్స కోసం తొలుత అందుబాటులో ఉండేది ఆర్ఎంపీ, పీఎంపీలు కాబట్టే సమాజంలో వారి పాత్ర కూడా కీలకమేనని పలమనేరు ఎస్‌ఐ స్వర్ణతేజ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ మాట్లాడారు. రోగులకు ప్రథమ చికిత్స చేయడంతోపాటు మెరుగైన వైద్యం కోసం వారు ఎక్కడికెళ్లాలి? ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేత జనార్ధన్, పలువురు పీఎంపీ, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ప్రయోగశాల సామగ్రి వితరణ

- దాతృత్వం చాటుకున్న బీసీఎన్ విద్యాసంస్థల అధినేత నాగరాజు



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న బీసీ నాగరాజు

కుప్పం రూరల్: తన జన్మదినాన్ని పురస్కరించుకుని బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజు విజలాపురం కేజీబీవీ స్కూల్‌కు రూ.1.5 లక్షల విలువ చేసే ప్రయోగశాల సామగ్రిని వితరణగా ఇచ్చారు. విద్యార్థులు భౌతిక, రసాయన శాస్త్ర పరికరాలు లేవని తన దృష్టికి రావడంతో నాగరాజు స్పందించారు. అవసరమైన సామగ్రి, పరికరాలు అందజేసి ప్రయోగశాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మారుమూల కుప్పంలో విద్యాసంస్థలతో ఎంతో మందికి విద్యను అందించడం గర్వకారణంగా ఉందన్నారు. అలాగే, తమ సంస్థలో పని చేస్తున్న 449 మంది ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.22.5 కోట్లకు ఇన్సూరెన్సు చేశామని, ఎవరికి ప్రమాదం జరిగినా, ప్రమాదవశాత్తు మరణించినా ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందు తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్ రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్ పాల్గొన్నారు.

లింగాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని లింగాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మురళి నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు–సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.